క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం


తూర్పురాజగోపుర ప్రాంతంలో ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైనరోజు కావడంతో ప్రతివారం వేలాది మంది భక్తులు చినవెంకన్నను దర్శిస్తారు. అయితే ఈ వారం భక్తుల రద్దీ బాగా తగ్గింది. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తులు నామమాత్రంగా కనిపించారు. ఆదివారం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

శ్రీవారి పథకాలకు రూ.4 లక్షల విరాళం


సరోజినికి బాండ్ పత్రాన్ని అందిస్తున్న హయగ్రీవాచారి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వడ్లమూడి సరోజిని రూ.1,00,116, చిన నింద్రకొలనుకు చెందిన జి.మధు సాయి చరణ్ రూ.1 లక్ష, విమానగోపుర స్వర్ణమయ పథకానికి మధుసాయి చరణ్ రూ.2 లక్షలు శనివారం అందించారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్‌లు హయగ్రీవాచారి, జి.సుబ్రహ్మణ్యంలు విరాళం బాండ్ పత్రాలను అందజేశారు.

శాస్త్రోక్తంగా హనుమద్ వ్రతాలు


సరిపల్లి పంచముఖ ఆంజనేయస్వామి

కొయ్యలగూడెం: హనుమద్ వ్రత ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం సరిపల్లి పంచముఖ అంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ వ్రతం, బయ్యన్నగూడెం, సరిపల్లి రోడ్డులోని సంజీవ ఆంజనేయ స్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. ఐదువేల తమలపాకులతో స్వామివారికి పూజ చేశారు. ఆదివారం స్వామివారికి లక్ష అరటిపళ్లతో పూజలు చేసినట్టు ఆలయ ధర్మకర్త మిర్యాల దుర్గారావు తెలిపారు.

ఘనంగా మందిర ప్రతిష్ఠ ఆరాధన


మందిర ప్రతిష్ఠ ఆరాధన నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో షాలేము మినిస్ట్రీస్ అధ్యక్షుడు జి.జ్ఞాన్ రాజు ఆధ్వర్యంలో నిర్మించిన ప్రార్థన మందిరాన్ని ఇంటింటా సువార్త దండయాత్ర అధ్యక్షుడు సీహెచ్ జాన్ బాబు, ఆంధ్ర, తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు కురసం నిరీక్షణరావులు శనివారం ప్రారంభించారు. ప్రజల్లో శాంతి, సమదానాలు నింపేందుకు యేసుక్రీస్తు ఈ భూమిపై జన్మించారని, ప్రతి ఒక్కరూ తోటి వారితో ప్రేమగా నడుచుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో పాస్టర్లు సీహెచ్ రవికుమార్, తిమోతి, చిన్నారావు, రమేష్, ప్రసన్న కుమార్, అకుల, ఇశ్రాయేలు, యేసుబాబు పలువురు పాల్గొన్నారు.

సూరిబాబు మృతి తీరని లోటు


సూరిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేత అనిత

లింగపాలెం: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, సొసైటీ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ ఏపూరి సూరిబాబు మృతి పార్టీకి, ఆయన కుటుంబానికి తీరనిలోటని వైఎస్సార్ సీపీ నాయకురాలు పొన్నాల అనిత, నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, బీవీఎస్ రెడ్డి అన్నారు. ఇటీవల పుష్పాలవారిగూడెంలో గుండెపోటుతో మృతి చెందిన సూరిబాబు చిత్రపటానికి శనివారం వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూరిబాబు కుమారుడు వెంకట్రావును పరామర్శించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పచ్చదనం కనుమరుగు


రోడ్డుకు ఇరువైపులా మామిడి చెట్లు (ఫైల్)


రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగిస్తున్న దృశ్యం


రోడ్డుకు ఇరువైపులా ఉన్న తురాయి చెట్లు (ఫైల్)

- రోడ్డు వెడల్పుతో చెట్ల తొలగింపు
- పర్యావరణానికి ముప్పు

కామవరపుకోట: దశాబ్దకాలంగా రహదారికి ఇరువైపులా నీడనిస్తున్న తూరాయి, చింత, మామిడి చెట్లను రోడ్డు వెడల్పులో భాగంగా తొలగిస్తున్నారు. దీంతో ఆయా మార్గాల్లో పచ్చదనం, ఆహ్లాదం కనుమరుగైంది. పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని ప్రకృతి ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు జిల్లాలోనే ఎక్కడ లేనివిధంగా కామవరపుకోట మండలంలోని తడికలపూడి నుంచి ఆడమిల్లి, కామవరపుకోట వరకు రోడ్డుకు ఇరువైపులా చెట్లు గుబురుగా ఉన్నాయి. దీంతో వర్షాకాలం వచ్చిందంటే పచ్చదనం, తురాయి చెట్లు ఎర్రని పూలతో కనువిందు చేస్తూ ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచేవి. వేసవి కాలం వచ్చిందంటే ఈ చెట్లు నీడన చల్లదనంతో వాహనచోదకులు సేదదీరేవారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెంకటేశ్వరస్వామి ఆలయానికి ద్వారకాతిరుమల వెళ్లడానికి ఏలూరు, లింగపాలెం, దెందులూరు మండలాలకు చెందిన భక్తులు నిత్యం ఈ రహదారి వెంబడి కాలినడకన వెళుతూ, ఈ చెట్ల క్రింద విశ్రాంతి తీసుకుని వీరిశెట్టిగూడెం గ్రామం మీదుగా వెళుతుంటారు. ఈ చెట్లను తొలగించడంతో ప్రయాణికులకు, కాలినడకన వెళ్లే భక్తులు, పకృతి ప్రేమికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రయాణం సక్రమంగా సాగాలంటే రహదారుల నిర్మాణం కూడా ప్రజలకు ఎంతో అవసరమని కొందరు భావిస్తున్నారు. చెట్లు తొలగింపుతో పచ్చదనం పోయి పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని, మరల రహదారికి ఇరువైపులా మొక్కల నాటి, వాటిని సంరక్షించాలని మరి కొందరు కోరుతున్నారు.

మొక్కలు నాటాలి



రహదారికి ఇరువైపులా కిలో మీటర్ల దూరం ఉన్న దశాబ్దాల కాలం నాటి చెట్లు తొలగించడంతో పచ్చదనం పోవడంతోపాటు, పర్యావరణానికి నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం మరలా రహదారి ఇరువైపులా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి.

– కడిమి రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు, కామవరపుకోట

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 16వ తేదీ నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిత్యం ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు తిరుప్పావై సేవా కాలం, తీర్థ ప్రసాద గోష్టి, తిరుప్పావై ప్రవచనం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 8న దీపోత్సవం, 10న ముక్కోటి ఏకాదశి ఉత్సవం, 12న కూడార్తై ఉత్సవం, 13న భోగి సందర్భంగా గోదా కల్యాణం నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని రాంబాబు కోరారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ


మనోజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలరాజు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పేరాబత్తుల మనోజ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులను బాలరాజు పరామర్శించారు. మనోజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మనోజ్ ఎంతో ఉత్సాహవంతుడని చిన్నవయస్సులోనే మృతి చెందడం బాధాకరమని బాలరాజు అన్నారు. మనోజ్ మరణం పార్టీకి తీరనిలోటన్నారని తెలిపారు. మనోజ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆ తీర్పు రాజ్యాంగ విరుద్ధం


పోస్టర్లు చూపుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగానికి పూర్తిగా వ్యతిరేకమని మాల సంఘాల ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జేఏసీ ఏలూరు జిల్లా నాయకులు అభిప్రాయపడ్డారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ ఆయా రాష్ట్రాలు చేసుకోవచ్చని, ఇచ్చిన సూచనను వ్యతిరేకిస్తూ మాల సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 15వతేదీ ఆదివారం గుంటూరులో మాలల గర్జన మహాసభ పేరిట భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసినట్టు చెప్పారు. హలో మాల.. చలో గుంటూరు నినాదంతో ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద కులంగా మాలలు ఉన్నారని, దాదాపు కోటి మంది మాలలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.

ప్రశాంతంగా నీటి సంఘాల ఎన్నికలు

బుట్టాయగూడెం: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు స్వల్ప ఘర్షణలతో ప్రశాంతంగా ముగిశాయి. జైనవారిగూడెం, మంచులవారిగూడెం, రెడ్డి గణపవరం గ్రామాల్లో ఎన్నికల ప్రారంభం స్వల్ప ఘర్షణలతో చోటుచేసుకున్నప్పటికీ తదుపరి రైతులు అందరూ ఏకగ్రీవంగా అభ్యర్థులను ఎన్నుకున్నారు. మండలంలో 22 నీటి సంఘాలకు సంబంధించి 132 టీసీల పరిధిలో 127 ఏకగ్రీవమైనట్టు తహసీల్దార్ పీవీ చలపతిరావు తెలిపారు. ఐదు టీసీలకు ఓటర్లు హాజరు కాక ఎన్నిక జరగలేదని చెప్పారు. ఏకగ్రీవమైన అధ్యక్షులకు నియామకపత్రాలను ఎన్నికల అధికారులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం మండలంలో..

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలో నాలుగు ఎర్రకాలువ రిజర్వాయర్‌కు, 14 చెరువులకు నీటి సంఘాలు ఏక గ్రీవంగా ఎన్నికయినట్టు తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. ఎర్రకాలువ ప్రాజెక్టు నాలుగు నీటి సంఘాలకు 8 మంది చొప్పున, 14 చెరువులకు నలుగురు చొప్పున డైరెక్టర్లను ఎన్నుకున్నట్టు చెప్పారు.


రెడ్డిగణపవరంలో నీటి సంఘం అధ్యక్షులకు నియామక పత్రం అందిస్తున్న అధికారులు

స్వల్ప వాగ్వాదం

కామవరపుకోట: మండలంలో ఏడు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. కేఎస్ రామవరం జగన్ నాయకుల చెరువు నీటి సంఘం మూడో వార్డు ఎన్నిక స్వల్ప వివాదం కారణంగా త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల అధికారి చిన్నం ప్రశాంత్ కుమార్ తెలిపారు. మిగిలినవన్నీ ఏకగ్రీవమైనట్టు చెప్పారు.

సాగునీటి సంఘాల నియామకం

కొయ్యలగూడెం: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు తహసీల్దార్ కె.చెల్లన్నదొర తెలిపారు. మొత్తం 11 సాగునీటి సంఘాల కమిటీలు నిర్వహించామన్నారు.

13 నీటి సంఘాలకు ఎన్నికలు

ద్వారకాతిరుమల: మండలంలోని 13 నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. వీటిలో తిమ్మాపురం, సత్తాల, పంగిడిగూడెం, నారాయణపురం, తిరుమలంపాలెం (3), నారాయణపురం (7) నీటి సంఘాలు పాల్గొన్నాయి. 78 టీసీలకు 61 టీసీలు ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు తహసీల్దార్ జీవీ సుబ్బారావు తెలిపారు. మిగిలిన 17 టీసీలకు ఓటర్లు హాజరుకాలేదని పేర్కొన్నారు.

టి.నరసాపురం మండలంలో..

టి.నరసాపురం: మండలంలో నాలుగు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు ఏకగ్రీవమయ్యాయని తహసీల్దార్ టి.సత్యసాయిబాబా తెలిపారు. ఈ సంఘాలకు 16 మంది డైరెక్టర్లు ఎన్నికయినట్టు చెప్పారు.

లింగపాలెం మండలంలో..

లింగపాలెం: మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు తహసీల్దార్ నజీముల్లాస తెలిపారు. మొత్తం 20 సంఘాలకు చైర్మన్, వైస్ చైర్మన్లు, 120 మందిని డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి : మండలంలోని వద్రుగూడెం గ్రామంలో శనివారం సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఆర్కే నగర్, వద్రుగూడెం గ్రామానికి చెందిన తాళ్లూరి వెంకటేష్ అనే వ్యక్తి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీన చేసుకుని, నిందితుణ్ణి అరెస్ట్ చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో తయారీ విక్రయాల్లో నిందితురాలిని తహసీల్దార్ ఎదుట హాజరు పరచి, బైండ్ ఓవర్ కేసు నమోదు చేశామన్నారు. అనంతరం నాగిరెడ్డిగూడెంలో గ్రామస్తులతో సారా తయారీకి దూరంగా ఉంటామని ప్రమాణాలు చేయించామని తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వైవీఎస్ ఫణి కుమార్, సిబ్బంది, ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి ఆహ్వానం

కొయ్యలగూడెం: గన్నవరంలో నిర్వహించే జనవరి 5న హైందవ శంఖారావానికి హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు నిర్వాహకులు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. తపన ఫౌండేషన్ చైర్మన్ తపన చౌదరి ఆధ్వర్యంలో శంఖారావం సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కట్నేని కృష్ణ ప్రసాద్, హైందవ శంఖారావం కోఆర్డినేటర్ తనికెళ్ల రవికుమార్, బోలిన నిర్మల కిషోర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కుక్కునూరు: మారేడుమిల్లి పీహెచ్‌సీలో పని చేస్తున్న సిబ్బందిపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సున్నం శ్రీరాములు దొర డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాములు ఆధ్వర్యంలో కుక్కునూరు పీహెచ్‌సీ వద్ద వైద్యులు, సిబ్బంది నల్ల రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. కుక్కునూర్ డివిజన్ నాయకురాలు తెల్లం వెంకాయమ్మ మాట్లాడుతూ మారేడుమిల్లి పీహెచ్‌సీలో విధుల్లో హెల్త్ అసిస్టెంట్‌పై దొరచింతలపాలెం పంచాయతీ శ్రీపురం గ్రామానికి చెందిన పత్రి ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ప్రవీణ్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, ఏఎన్ఎం టి.వెంకాయమ్మ, ఎం.గంగాభవాని, కె.భీమమ్మా, టి.భూలక్ష్మి, పి.కృష్ణవేణి, డి.రజిత, ఎం.సీత, ఎన్ నాగమణి, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కుక్కునూరు పీహెచ్‌సీ వైద్యులు

లోక్ అదాలత్‌లో 530 కేసుల పరిష్కారం

జంగారెడ్డిగూడెం: జాతీయ లోక్ అదాలత్‌లో 530 కేసులు పరిష్కారమైనట్టు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్ కిషోర్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్ 12, ఐపీసీ 65, మనోవర్తి 2, చెక్‌బౌన్స్ 5, ఎక్సైజ్ 210, బెంచ్‌కోర్టు 232, బీఎస్ఎన్ఎల్ కేసులు 4 పరిష్కారమైనట్టు జడ్జి కిషోర్‌కుమార్ తెలిపారు. లోక్ అదాలత్ వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతలపూడి కోర్టులో..

చింతలపూడి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 280 కేసులు పరిష్కారమైనట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. వీటిలో ఎక్సైజ్ కేసుల్లో రూ.85,43,580 అపరాధ రుసుము తోపాటు, కాంపౌండింగ్ ఫీజు వసూలు చేసినట్టు పేర్కొన్నారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ఉపయోగాలను జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు వివరించారు. లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కక్షిదారులకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, పట్నాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జడ్జి కిషోర్‌కుమార్

6న కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా

కుక్కునూరు: గిరిజనుల సమస్యల పరిష్కారం కోరుతూ జనవరి 6న కేఆర్‌పురం ఐటీడీఏ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపందా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపందా చుక్కలబొద్ది, తెల్లరాయిగూడెం గ్రామ శాఖల సమావేశం మండల కార్యదర్శి కంగాల కల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వలస గిరిజనులు 30 ఏళ్లుగా ఆయా ఆవాసాల్లో 20 గ్రామాలను ఏర్పాటుచేసుకుని జీవిస్తున్నట్టు చెప్పారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలి, సకాలంలో వైద్యం అందక మృతి చెందుతున్నా వారికి తాగు నీరు, రోడ్లు, విద్యుత్ వంటి కనీస మౌలిక వసతులు పాలకవర్గాలు కల్పించడంలేదని విమర్శించారు. వారికి ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కేంద్ర ట్రైబల్ కమిషన్ ఆదేశించినప్పటికీ, గిరిజనుల సమస్యలు నేటికీ పరిష్కరించలేదని వివరించారు. సమావేశంలో నాయకుతు సోయం చందర్‌రావు, ఎస్కే మున్ని, ఎస్ ముత్యాలు, పి.వీరబాబు, ఎం దేవయ్య, ఎం అడమయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న షేక్ గౌస్

విర్డ్ ఆస్పత్రి సేవలు మరింత విస్తృతం

ముగిసిన క్యాంప్, 25 మందికి శస్త్రచికిత్సలు


శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ (శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ సర్జరీ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ద డిజేబుల్డ్) సేవలను మరింతగా విస్తృతపరుస్తామని ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యులు శ్రీనాథ్ కామినేని ఆధ్వర్యంలో ఈనెల 11న విర్డ్‌లో ప్రారంభమైన చారిటబుల్ ఆర్థోపెడిక్ క్యాంప్ శనివారంతో ముగిసింది. ఈ క్యాంప్‌లో భుజం, మోచేయి, తుంటి, మోకాలు సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్న 65 మంది రోగులను పరీక్షించిన డాక్టర్ కామినేని, 25 మంది రోగులకు విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహించారు. దివ్యాంగులకు కాలిపర్స్, ప్రమాదాల్లో కాళ్లు కోల్పోయిన వారికి అత్యాధునిక కృత్రిమ అవయవాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కామినేని మాట్లాడుతూ ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి, తగు చికిత్స పొందాలని సూచించారు. విర్డ్ ఆస్పత్రి ఈ ప్రాంత ప్రజలకు ఒక వరమని, ఈ ఆస్పత్రి సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకరరావు, వెంపరాల నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, కె.శ్రీనివాస్, బీఎస్, ఎల్లోరా పార్వతి, గాయత్రి, అనిరుద్ తదితరులున్నారు.

పారిజాతగిరి వాసునికి విశేష పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా విశేష పూజలు చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కాళహస్తి రాజరాజేశ్వరి తేజస్వి కాలినడక స్వామి సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. మేజిస్ట్రేట్‌కు ఈఓ మానికల రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా, పూజ అనంతరం అర్చకులు వేద ఆశీర్వాదం అందించి, స్వామి శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటంతో సత్కరించారు. స్థానిక తోట నరసింహారావు, దుర్గ, జుట్టా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యుల వితరణతో భక్తులు అన్నప్రసాద వితరణ చేసినట్టు ఈఓ తెలిపారు. కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగాప్రసాద్, దండు ధనరాజ్, వాసవీ సాయినగేష్‌లు పర్యవేక్షించారు.


మేజిస్ట్రేట్ రాజరాజేశ్వరి తేజస్వికి వేద ఆశీర్వాదం అందిస్తున్న అర్చకులు

నృత్య పోటీల విజేతలు వీరే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన అభినయ నృత్యభారతి సంస్థ 29వ వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జాతీయ స్థాయి నృత్యపోటీల విజేతల వివరాలను నిర్వాహకులు శనివారం ప్రకటించారు. శనివారం వివిధ రాష్ట్రాలకు చెందిన నర్తకులు ప్రదర్శించిన విభిన్న నృత్యరీతులు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. **కూచిపూడి సబ్ జూనియర్స్ :** టి.ఓజస్విని (ప్రథమ), సి.మిషిక (ద్వితీయ) (అనంతపురం), దేదీప్య (తృతీయ) (అమలాపురం). ప్రోత్సాహక బహుమతులు మనస్విని (నరసాపురం), పి.రిషిక (హన్మకొండ), జనన్య వర్మ (వరంగల్), కాత్యాయని, మోక్షత (విజయవాడ), ధన్వి శ్రీ (తణుకు). ప్రత్యేక బహుమతులు భువన చంద్రిక (ఖమ్మం), తన్విత (విశాఖపట్నం), కె.ప్రణవి (అమలాపురం), సింధుజ ప్రియ (హన్మకొండ), తుష్య (ఏలూరు), లాస్యశ్రీ (తణుకు), గీతాన్షి శ్రీ (విజయవాడ), ఎ.ఆకాంక్ష (పాల్వంచ), ఆలియా (విజయవాడ). **జానపదం సబ్ జూనియర్స్ :** మిహిర ప్రేమమయి (ప్రథమ), ఎ.భవిష్య (ద్వితీయ) (ఏలూరు), వైష్ణవి విహారి (తృతీయ, హన్మకొండ). ప్రోత్సాహక బహుమతులు రిషిప్రియ (ఏలూరు), ధన్వి శ్రీ (తణుకు), దేవాన్ష్ (ఏలూరు). ప్రోత్సాహక బహుమతులు సాయి సహస్ర, ఎ.విస్మయ వల్లిక (ఏలూరు), సింధుజా ప్రియ (హన్మకొండ).

సాల్వేషన్ ఆర్మీ చర్చి ప్రారంభోత్సవం

దెందులూరు: దెందులూరులో సాల్వేషన్ ఆర్మీ చర్చిని సాల్వేషన్ ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ ఎం స్టాలిన్, వైఎస్ కేజియా స్టాలిన్ శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పల్లె యోహాను చంద్రహాస కేటాయించిన స్థలంలో చర్చి నిర్మించారు. సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ జె.మోషే ఆధ్వర్యంలో దెందులూరు కోర్ ఆఫీసర్ ఎం రమణయ్య అధ్యక్షతన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్టాలిన్, కేజియా స్టాలిన్లకు దెందులూరు బస్టాండ్ సెంటర్ నుంచి గౌడ వీధిలోని చర్చి వరకు సంఘస్తులు గృహ సమితి సభ్యులు సండే స్కూల్ చిన్నారులు ఘన స్వాగతం పలికారు. నూతన చర్చి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, సహాయ సహకారాలు అందిస్తానని కల్నల్ దంపతులు అన్నారు. డీవైఎస్ టి.శ్యాంబాబు, రిటైర్డ్ ఆఫీసర్ జోషియా, కోర్ ఆఫీసర్లు సంఘ సభ్యులు ఉన్నారు.

ఘన సన్మానం : చర్చి స్థల దాతలు పల్లె హర్షవర్ధన్ సిలువ కుమారిని కల్నల్ దంపతులు డివిజనల్ కమాండర్ దంపతులు సత్కరించారు. హర్షవర్ధన్ దంపతులు యుగంధర్ అనిత కుటుంబ సభ్యులు లెఫ్టినెంట్ కల్నల్ దంపతులను సన్మానించారు.